క్లుప్తంగా

300 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: పాత్రికేయుడిగా, కమ్యూనిస్టుగా 40 ఏళ్ల పాటు నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన కావూరి సుబ్బారావు నేటి తరానికి ఆదర్శనీయుడని నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అన్నారు. శనివారం కావూరి 5వ వర్ధంతి సందర్భంగా నగరంలోని సంతపేటలో గల శివం శరణాలయంలోని వృద్ధులకు, శివం సంచార వాహనం ద్వారా నగరంలోని 300 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. సీపీఎం , ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీ మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని చదువుల తల్లి సరస్వతీదేవి అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ డైరెక్టర్ సన్నమూరి వెంకట సుశీల, సుబ్బనాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకొచ్చి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మత సామరస్యాన్ని పెంపొందించడమే దేశభక్తి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య ఐక్యమత్యం , మత సామరస్యాన్ని పెంపొందించడమే నిజమైన దేశభక్తి అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ జయప్రకాశ్ అన్నారు. మహాకవులు గుర్రం జాషువా, గురజాడ అప్పారావు, జాతిపిత మహాత్మా గాంధీ జయంతులను పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశభక్తి ప్రచార వారోత్సవాలలో భాగంగా శనివారం శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీ, ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు. జేవీవీ నగర అధ్యక్షుడు ఎస్వీ రంగారెడ్డి, కార్యదర్శి ఎన్‌టీ వెంకటేశ్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆంజనేయులు, కే సురేష్, అధ్యాపకులు షేక్ ఇస్మాయిల్, మురళి పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు సిటీ: ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఫ్రెషర్స్ డే సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాలల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. బీటెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేశారు. కళాశాలల గౌరవ చైర్మన్ శ్రీ ఇస్కాల చిన రంగమన్నారు, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక పాల్గొని మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నారు, డైరెక్టర్ డాక్టర్ భాస్కరరావు, సంబంధిత విభాగాధిపతుల చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసపత్రాలు అందజేశారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ వార్డు సెక్రటరీ అసోసియేషన్ ఎన్నికలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ వార్డ్ సెక్రటేరియట్ ఎన్‌జీఓ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం జరిగాయి. స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన ఈ ఎన్నికలలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా శింగంశెట్టి శ్రీ మహావిష్ణు 252 ఓట్ల మెజారిటీతో, ఉపాధ్యక్షునిగా డి.విజయ భాస్కరరెడ్డి 219 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వి.దిలీప్‌రెడ్డి వ్యవహరించారు.

నేడు గిరిజన ప్రజా చైతన్య యాత్ర సమావేశం

ఒంగోలు వన్‌టౌన్: గిరిజన ప్రజా చైతన్య యాత్ర సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలులోని గిరిజన భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ అధ్యక్షత వహిస్తారని, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



ఈతముక్కలలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న చుండూరి రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పాలనలో కార్యకర్తలకు భాగస్వామ్యం
- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు

కొత్తపట్నం:

మోసపూరిత, అబద్ధాలకోరు కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి మనమంతా ఐక్యం కావాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల, సంకువారిగుంట గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ ఈతముక్కల అధ్యక్షుడు పటాన్ నజీర్ అధ్యక్షత వహించగా, రవిబాబు మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఎరువులు అందక అల్లాడుతున్నారని మండిపడ్డారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టులు, వైద్యం, విద్య మీద దృష్టి పెట్టి పేద ప్రజలను ఆదుకోగా, ఆయన బాటలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడిచారని, తన హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ పథకాలిస్తామని చెప్పి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిపాలనలో పార్టీ శ్రేణులను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర జోనల్ ప్రెసిడెంట్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నూరు శాతం మేనిఫెస్టో అమలు చేసి అందించిన పథకాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అవినీతి అక్రమాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో భూములు కొని పట్టాలిప్పించి ఇళ్లు నిర్మించింది వైఎస్సార్ సీపీ హయాంలోనే అని గుర్తు చేశారు. మాజీ సర్పంచ్ దాసూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలంతా సుఖంగా ఉన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే.. ప్రస్తుతం వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం విద్యార్థులకు అన్యాయం చేసినట్లేనని మండిపడ్డారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లేక పొగాకు వేయడమే రైతులు మానుకుంటున్నారని తెలిపారు. అనంతరం కూటమి మేనిఫెస్టో మోసాలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలి భర్త సైకం రాంబాబు, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడు బాజీ, మండల ఉపాధ్యక్షుడు తాత నాంచార్లు, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటనారాయణ, బండారు వెంకటసుబ్బారావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, షేక్ నాగూర్, మహమ్మద్ అఖిల్, బాజీ, కరిముల్లా, నాగూర్‌వలి, తుమ్మ పుల్లయ్య, హేమంత్‌రెడ్డి, కసుకుర్తి వెంకట్రావు, లీలామోహన్, రవికుమార్, గిరిస్వాములు, మల్లవరపు రమేష్, చందు, గల్లగుంట బ్రహ్మయ్య, వాణి, మేరి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాలు లేవు

- అల్లాడుతున్న పారిశుధ్య కార్మికులు
- మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి విజయమ్మ



మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ నాయకుడు మహేష్

ఒంగోలు టౌన్: నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ పారిశుధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అల్లాడిపోతున్నారని మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి టి.విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2019లో కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో తీసుకున్న పారిశుధ్య కార్మికులు 150 మందికి గత నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కార్మికులు జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని, భార్యాబిడ్డల కడుపులు నింపడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకుంటున్నారని వాపోయారు. ఇక ఆ పరిస్థితి కూడా లేకుండా పోయిందని, బయట అప్పులిచ్చేవారు కూడా లేకుండా పోయారని అన్నారు. ప్రతిరోజూ ఆఫీసుకు, విధులకు వచ్చిపోయేందుకు ఆటో చార్జీలకు కూడా డబ్బులు లేక మస్టర్ పాయింట్లకు, అక్కడి నుంచి పని ప్రదేశాలకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఈఎస్ఐ గుర్తింపు కార్డు కూడా లేకుండా పోవడంతో చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోందని, స్థోమత లేక వైద్యం కూడా మానుకునే దుస్థితి దాపురించిందని చెప్పారు. సీఐటీయూ నగర కన్వీనర్ టి.మహేష్, యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, టి.సరిత, భారతి, దివ్య, పద్మ, పోతురాజు, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉంది



చీమకుర్తిలో మాట్లాడుతున్న చప్పిడి వెంగళరావు

చీమకుర్తి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉందని, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని దళిత సంఘాల ఐక్యవేదిక మాలల యువసేన వ్యవస్థాపకుడు చప్పిడి వెంగళరావు అన్నారు. శనివారం చీమకుర్తిలో మాలల సంఘాల స్థానిక నాయకులను కలిసి ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీలను వర్గీకరించే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటారనే ఉద్దేశంతోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముందుచూపుతోనే ఎస్సీలను వర్గీకరణ చేయకుండా ఆర్టికల్ 341లో పేర్కొన్నారన్నారు. దొడ్డిదారిన తీసుకొచ్చిన ఆర్డినెన్స్ చట్టాలు చెల్లవని, ఉన్నత న్యాయస్థానాలలో ఎప్పటికైనా వర్గీకరణ చట్టాలను రద్దు చేసేంత వరకు పోరాటం సాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేమా బాలకోటి, నాయకులు మేడికొండ మురళి, సుదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు



రక్తదాన శిబిరం, వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

చీమకుర్తి: చీమకుర్తి సీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, రక్తదాన శిబిరాన్ని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రతాప్‌కుమార్ ప్రారంభించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 12 విభాగాల డాక్టర్లతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. చీమకుర్తితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 400 మందికిపైగా రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు రక్తదానం చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ టీ వెంకటేశ్వర్లు వైద్యశిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, శిద్దా సుధాకర్, సూరిబాబు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



మద్దిపాడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ కమల

మద్దిపాడు: స్థానిక పీహెచ్‌సీని శనివారం మధ్యాహ్నం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ కమల ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమం ద్వారా అందించే టీకాలు, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పిల్లలు, పెద్దలు, గర్భిణులు, వృద్ధులంతా సిఫార్సు చేసిన టీకాలను షెడ్యూల్ ప్రకారం వేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. టీకాల గురించి ఉన్న అపోహలు తొలగించి ప్రజలకు సరైన సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని కొలచనకోట గ్రామంలో స్వస్త నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు. ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా 104 నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అన్వేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లలితమ్మ, సీహెచ్ రజితకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు కె.సీతమ్మ, నాగరాజి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో రాజ్యాంగానికి అవమానం



మాట్లాడుతున్న ఏడుకొండలు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానం చేయడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని మాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కె.ఏడుకొండలు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఒంగోలులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వం వర్గీకరణ చేపట్టడం అన్యాయమన్నారు. షెడ్యూల్డు కులాలకు చెందిన ప్రజాప్రతినిధులు కనీసం వర్గీకరణపై నోరు మెదపడంలేదన్నారు. మాల ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. అసెంబ్లీలో షెడ్యూల్డు కులాల వర్గీకరణను కూడా మాల కులానికి చెందిన మంత్రే ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. కౌన్సిల్ చైర్మన్ మోషేన్ రాజు మాల జాతికి అన్యాయం జరగకుండా చూడాలని కోరడం అభినందనీయమన్నారు. సమావేశంలో మాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

తోట సుధాకర్ సేవలు స్ఫూర్తిదాయకం



తోట సుధాకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకుడు తోట సుధాకర్ సేవలు స్ఫూర్తిదాయకమని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు అన్నారు. సుధాకర్ 24వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు రెవెన్యూ అసోసియేషన్ హాలులోని ఆయన విగ్రహానికి శనివారం రాత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ ఉద్యోగుల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించిన ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కలెక్టరేట్ అధ్యక్షుడు బి.సత్యసాయి శ్రీనివాస్, ఏపీ జేఏసీ అమరావతి ఉమన్ వింగ్ జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఉత్కోలు శ్రీనివాసరావు, జిల్లా ఈసీ సభ్యుడు ప్రశాంత్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

లలితా త్రిపురసుందరిగా అమ్మవారు



ఒంగోలు నెహ్రూ కాలనీలో కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవార్ల వేషధారణలో మహిళలు



ఒంగోలు మర్రిచెట్లకాలనీలో కనకదుర్గ మండపంలో నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: దసరా దేవీశరన్నవరాత్రుల్లో ఆరో రోజైన శనివారం ఆలయాల్లో అమ్మవార్లను లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఒంగోలు నగరంలో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని జగన్మాతను దర్శించుకుని పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చీమకుర్తి సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించగా భక్తులు దర్శనం చేసుకుని పూజలు చేశారు.

మార్టూరు సీఐపై కేసు నమోదు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: మార్టూరు సీఐపై కేసు నమోదు చేయాలని మాల మహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా మార్టూరు మండలం డేగర్లమూడి గ్రామానికి చెందిన షెడ్యూల్డు కులాల వ్యక్తులు అల్లడి ప్రమోద్‌కుమార్, జ్యోతి పోతులూరిని తప్పుడు కేసులో సీఐ ఇరికించారన్నారు. బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. వీరు ఆ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కీలకంగా మారినందున అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వారిపై సీఐ తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. సీఐపై షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల రాష్ట్ర, జాతీయ చైర్మన్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆలాస్ ఫుడ్ వరల్డ్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నిర్వాహకులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని సౌత్ బైపాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలాస్ ఫుడ్ వరల్డ్ ఆర్గానిక్ రెస్టారెంట్‌ను మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు శనివారం ప్రారంభించారు. నాణ్యతకు మారుపేరుగా రెస్టారెంట్ నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రజలంతా పురుగు మందుల అవశేషాలు లేని ఆహారాన్ని కోరుకుంటున్నారని, అలాంటి ఆహారాన్ని ఆలాస్ ఫుడ్ వరల్డ్ ఆర్గానిక్ రెస్టారెంట్ అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఆలాస్ గ్రూప్ చైర్మన్ ఏపీఎస్ రాజు, యజమాని హర్ష, నాయకులు శేషం రాజు, దుగ్గినేని గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి సభ

ఒంగోలు మెట్రో: స్థానిక గ్రంథాలయ ఆవరణలో నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి గుర్రం జాషువా 130వ జయంతి సభను ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు, జాషువా అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు 20 శాతం షాపులివ్వాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న మాదిగ సంక్షేమ పోరాట సమితి నాయకులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని పాత మార్కెట్ ఆవరణలో నిర్మించనున్న జీ-4 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీలకు 20 శాతం షాపులు కేటాయించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం జేసీ గోపాలకృష్ణకు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీతో సుజన్ మాదిగ మాట్లాడుతూ పాత మార్కెట్ స్థలంలో జీ-4 షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీ, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళలకు 20 శాతం షాపులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని జేసీ హామీ ఇచ్చారని సుజన్ మాదిగ తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎం.సి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె త్యాగరాజు, నాయకుడు పత్రా బంగారం, ఒంగోలు నగర యాదవ జేఏసీ అధ్యక్షుడు డి.అప్పారావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తేళ్ల జయరాజ్, కత్తి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మహేష్ కుమార్

కొత్తపట్నం గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కొత్తపట్నం పీహెచ్‌సీ డాక్టర్ మహేష్ కుమార్ అన్నారు. స్వస్తి నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆలూరులో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి, గాదెపాలెం సర్పంచ్ గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ సంపాదన కంటే ఆరోగ్యం ముఖ్యమని, దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మన శరీరానికి అవసరమైన ఆహారమే తీసుకోవాలని, అప్పుడే మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాదె కోటిరెడ్డి, సుబ్బారావు, నాగరాజు, పుల్లారెడ్డి, చిన్న వెంకటరెడ్డి, సీహెచ్‌వో ఓంకారం, సూపర్‌వైజర్లు ఇందిరాదేవి, సులోచనరాణి, పి.ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వోలు), ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా దసరా సంబరాలు



ప్రత్యేక వేషధారణల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు దసరా సంబరాలను శనివారం కోలాహలంగా నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక వేషధారణలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ పాటలకు విద్యార్థులంతా ఆడిపాడారు. విద్యార్థుల నవదుర్గల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులకు ముగ్గులు, ఆర్ట్, పెయింటింగ్, మెహందీ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విజేతలను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, కల్చరల్స్ డీన్ డాక్టర్ నవనీతకృష్ణ పర్యవేక్షించారు.

దేవుడు చూపిన మార్గంలో నడవాలి

ఒంగోలు మెట్రో: బైబుల్‌లోని వాక్యాలను అర్థం చేసుకుని దేవుడు చూపిన మార్గంలో నడవాలని స్థానిక సెయింట్ థెరిసా చర్చి ఫాదర్లు సూచించారు. చర్చిలో నవదిన వేడుకలలో భాగంగా శనివారం ఉదయం నిర్వహించిన ప్రార్థనలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ ఫాదర్ స్టానిస్లాస్ దేవుని వాక్యం వినిపించారు. వ్యర్థముగా పడుకోకనే అంశంపై ప్రసంగించారు. అనంతరం దివ్య బలి పూజ సమర్పించి భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ డీఎస్ పాల్, అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు, నగరంలోని పలు ప్రాంతాల సంఘ పెద్దలు, బైరం రమేష్, బైరం సురేష్ పాల్గొన్నారు.